జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి
సోమవారం 22 జూన్ 2026 సంపుటి : 16 సంచిక : 330 పేజీలు : 8 వెల : 1/-
RNI NO.APTEL/2010/36516
శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, ఉత్సవము: ఆరుద్ర కార్తె, సూర్య చంద్రుల సమయాలు, సూర్యోదయం : 5:27 సూర్యాస్తమయం : 6:31, చంద్రోదయం : 12:17 చంద్రాస్తమయం : 12:30, పంచాంగం : తిథి : శుద్ధ అష్టమి రా. 7:31 వరకు, తర్వాత నవమి, నక్షత్రం : ఉత్తర మ. 2:44 వరకు, తర్వాత హస్త, యోగం : వ్యతీపాత మ. 3:09 వరకు, తర్వాత వరీయాన్, కరణం: భద్ర ఉ. 7:45 వరకు, తర్వాత బవ రా. 7:31 వరకు, తర్వాత బాలవ
Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail : prajajyothidaily@gmail.com

# ఇంటర్-డోజో కరాటే ఛాంపియన్‌షిప్-2026లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్ జూన్ 21 ప్రజా జ్యోతి**

యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్-డోజో కరాటే ఛాంపియన్‌షిప్--2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్, మాస్టర్ కిషోర్ కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజుతో కలిసి ఎమ్మెల్యే పోటీలను పరిశీలించారు. చిన్నారులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు సభికులను ఆకట్టుకోగా, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, క్రమశిక్షణతో పాటు ఆత్మరక్షణ సామర్థ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. నేటి సామాజిక పరిస్థితుల్లో బాలబాలికలకు ఆత్మరక్షణ శిక్షణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. యువతను క్రీడలు, విద్య, సామాజిక సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, నియోజకవర్గంలో యువ ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో

# పేదలకు ఒక నీతి, పెద్దలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తుంది

కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం దగ్గర పడింది

ఒక సంవత్సరం పాటు మీరే కాపాడుకోండి, కాంగ్రెస్ నాయకులు మాటలు నమ్మొద్దు

ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి మళ్ళీ రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

హనుమాన్ నగర్ బస్తి వాసులకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా

రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని హనుమాన్ నగర్ బస్తీలో నిర్వహించిన

బస్తీ బాట కార్యక్రమంలో పాల్గొని సమస్యలు తెలుసుకున్న కేటీఆర్



బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, డిల్లీ పరమేష్, శ్రీధర్ గౌడ్, తోట నరేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, శోభన్ బాబు, భాస్కర్ రెడ్డి, కరంచంద్, శ్రీనివాసులు, శరణ్ గిరి, సురేష్, సాయి గౌడ్, చిన్నం శ్రీనివాస్, రమేష్, ప్రవీణ్, శోభా, విక్రం గౌడ్, మారుతి ప్రసాద్, నరేష్, ఆదినారాయణ, మురళి నాయుడు, మహేష్, సంతోష్ గుప్తా, ప్రభాకర్ గౌడ్, నర్సింగ్ రావు, తిరుపతి రావుతో పాటు అంబేద్కర్ సంఘ నాయకులు, మహిళలు, యువకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# కనకమామిడిలో సీసీ రోడ్డు పనుల పరిశీలన

అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కాలే యాదయ్య

గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం

కనకమామిడి గ్రామ సర్పంచ్ శ్రీ దివ్య మురళీధర్ రెడ్డి

# చెరువులోకి వ్యర్థాలు... చేపల మృత్యువాత





కాశన్న కుంట చెరువులో భారీగా చేపలు మృతి

అధికారుల నిర్లక్ష్యంపై మత్స్యకారుల తీవ్ర ఆగ్రహం

భారీగా నష్టపోయిన రైతులు ఇప్పల్ల గిరి,వీరమోని మల్లేష్

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం కట్టించాలి





కొత్తూర్ జూన్ 21 (ప్రజా జ్యోతి)వ్యర్థ రసాయనాలు చెరువులోకి వదలడంతో చేపలు మృతిచెందిన ఘటన కొత్తూరు మున్సిపాలిటీలోని కాశన్న కుంట చెరువులో ఆదివారం చోటుచేసుకుంది.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం..ప్రమాదకర రసాయన వ్యర్థాలు,డ్రైనేజీ నీరు,కొత్తూరు పట్టణానికి సంబంధించిన మురికి నీరు (డ్రైనేజ్ నీరు) అంతా నేరుగా చెరువులోకి కలవడమే ఈ ఘోరానికి కారణమని మత్స్యకార రైతులు ఇప్పల్ల గిరి, వీరమోని మల్లేష్ చెప్పుకొచ్చారు.చేతికొచ్చే తరుణంలో 'లక్షల'నష్టం చేపల కొనుగోలు, మేత, రాత్రింబవళ్లు పడిన కష్టం.. ఇలా లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడిగా పెట్టారు మత్స్యకార రైతులు. ఇంకొద్ది రోజుల్లో చేతికి వస్తాయనుకున్న తరుణంలో, చెరువు నిండా చేపలు విగతజీవులుగా తేలడంతో రైతుల గుండె పగిలింది. లక్షల రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరైందని,తాము కోలుకోలేని విధంగా నష్టపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యర్థ రసాయనాలు వదలడంతోనే చేపలు మృతి చెందాయని వారు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుని,బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు.అధికారులు స్పందించి చెరువులోకి మురుగు రాకుండా చర్యలు చేపట్టడంతో పాటు చేపలు మృతిచెందడంపై విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

# రైతు రఘునందన్‌కు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటది

కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్

కుమ్మరిగూడలో సంఘటన స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**కొత్తూర్ జూన్ 21 (ప్రజా జ్యోతి)** రైతు రఘునందన్ కు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో జరిగిన పశువుల మృతి ఘటన పై కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు జాండగూడెం సుదర్శన్ గౌడ్ తో కలిసి కాంగ్రెస్ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బాధిత రైతు రఘునందన్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. రైతు రఘునందన్‌కు చెందిన 8 ఆవులు,ఒక దూడ మృతి చెందడం అత్యంత దురదృష్టకరమన్నారు.పశువుల మేతలో యూరియా కలవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని పేర్కొన్నారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతు కుటుంబానికి జరిగిన నష్టం లక్షల్లో ఉందని, ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ప్రభుత్వం వారు చెప్పారు.అలాగే ఈ ఘటనకు కారణమైన వారిని గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పీర్లగూడ మహేష్ గౌడ్,భరత్ గౌడ్,చిల్కమర్రి నరసింహ,డీలర్ నరసింహ,కుమ్మరి లక్ష్మయ్య,శివ శంకర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలు, ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

**---ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర నాయకులు జిల్లా ఆనంద్**



**రాజేంద్రనగర్, జూన్ 21 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో అనుమతులు లేకుండా, అక్రమంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర నాయకులు జిల్లా ఆనంద్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సులను తక్షణమే సీజ్ చేసి, సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ జీఓలను ధిక్కరిస్తూ, నిబంధనలను తుంగలో తొక్కుతూ, విద్యను వ్యాపారంగా మార్చిన యాజమాన్యాలకు ఎలాంటి ఉపశమనం కల్పించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నమని అన్నారు. ప్రజల ప్రాణాలు, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న అక్రమ పాఠశాలలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే, భారీ స్థాయిలో ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, కార్యాలయాల ముట్టడిలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బోయిన్‌పల్లిలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి

తెలంగాణ సాధన కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు



**బోయిన్ పల్లి, జూన్ 21 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బోయిన్‌పల్లి ప్రగతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం న్యూ బోయిన్‌పల్లి జయనగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, తెలంగాణ వాదులు జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన విశిష్ట సేవలను కొనియాడారు.కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్, బీఆర్ఎస్ నేత రాగిరి టింకు గౌడ్, జనతా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షులు నీరుడు అశోక్ కుమార్ ముదిరాజ్, డాక్టర్ కె. హరీష్ కుమార్, ప్రగతి సంఘం అధ్యక్షుడు ఓం ప్రకాష్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గడీల శ్రీను ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, భావోద్వేగాలతో పాటు బలమైన మేధోపరమైన పునాదితో తెలంగాణ ఉద్యమాన్ని ప్రజాపోరాటంగా మలిచిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు.నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో జరిగిన అన్యాయాలను గణాంకాలతో సహా ప్రజల్లోకి తీసుకెళ్లి, స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రతి గుండెలో నాటిన మహనీయుడు జయశంకర్ సార్ అని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని బోయిన్‌పల్లి ప్రగతి సంఘం పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, దిలీప్ యాదవ్, డాక్టర్ కె. హరీష్ కుమార్, సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

# జయశంకర్ సేవలు చిరస్మరణీయం

- ప్రొఫెసర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి
- బీజేపీ నేతలు అనంత్ రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి





**చేవెళ్ల జూన్ 21(ప్రజా జ్యోతి):** తెలంగాణ ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. మల్గారి వైభవ్ రెడ్డి అన్నారు. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆదివారం చేవెళ్లలో ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ చేసిన కృషి, ఉద్యమానికి అందించిన మార్గదర్శనం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లిన మహనీయుడిగా జయశంకర్ సార్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**డా. మల్గారి వైభవ్ రెడ్డి మాట్లాడుతూ.**

.తెలంగాణ స్వాభిమానం, సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం జయశంకర్ సార్ చేసిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ ప్రజల కోసం పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మాజీ జిల్లా కార్యదర్శి అర్రపల్లి అశోక్, బీజేపీ నాయకులు పత్తి సత్యనారాయణ, చేగురి ప్రవీణ్ రెడ్డి, పిసరి శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వడ్డే గణేష్, రామకృష్ణ, పాగ వెంకటేష్, ఆనంద్ చారి, శేఖర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు




**ఉప్పల్, జూన్21( ప్రజా జ్యోతి):** ఉప్పల్ మినీ శిల్పారామం లో అంతర్జాతీయ సంగీత దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి .సంగీత సిస్టర్స్, సంగీత కళ, రాజ్యలక్ష్మి ఆధ్వర్యం లో నిర్వహించడం జరిగింది.భక్త రామదాసు, త్యాగరాజు,అన్నయ్య సంకీర్తనలు ఆలపించారు. శ్రీ వేదాంత , శ్రీ తేజోభిరాం మృదంగ విన్యాసం అలరించింది. అనురాధ, మాలిని, హారతి, ఇషిత, కార్తీక, లౌకిక, అన్విక,శ్రీనివాస్, శ్రీయ మొదలైన వారు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణ కాలనీలో రూ.6.42 లక్షల యూజీడీ పనులకు శ్రీకారం



**అల్వాల్ జూన్ 21 (ప్రజా జ్యోతి)** అల్వాల్ నియోజకవర్గ పరిధిలోని 195వ డివిజన్ లక్ష్మీనారాయణ కాలనీ, సుభాష్‌నగర్‌లో రూ.6.42 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ పాల్గొని పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రాంత అభివృద్ధికి మరిన్ని పనులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.

# అల్వాల్ పీహెచ్‌సీలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**అల్వాల్, జూన్ 21.(ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ( టి హెచ్ సి)లో ఆదివారం ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల మాణిక్య రెడ్డి, శ్రీనివాస్ వర్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) అధికారులు, జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి యోగా ఆసనాలు నిర్వహించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పల్లో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై భారతీయ జనతా పార్టీ నిరసన దీక్ష

**ఆర్టిఐ నిబంధనల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన డివిజన్ అధ్యక్షులు మార్నేని ఫణీంద్ర**




**ఉప్పల్,జూన్21,(ప్రజా జ్యోతి):** ఉప్పల్ మెయిన్ రోడ్డులో గల గాంధీ బొమ్మ విగ్రహం వద్ద బీజేపీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మర్నేని ఫణీంద్ర ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల దోపిడీపై నిరసన దీక్ష జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ మాజీ శాసన సభ్యులు బేతి సుభాష్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పరెడ్డి,రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్ పాల్గొని సంఘీభావం తెలిపారు,ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మర్నేని ఫనీంద్ర మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, యూనిఫాంలు ఫీజుల విషయంలో తల్లిదండ్రులను ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్న నేపథ్యంలో, ఈ సమస్యలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని నిరసిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో ఉచిత విద్యా చట్టం (ాజు ూాష్-2009) ప్రైవేట్ పాఠశాలల నిబంధనలు,భారతదేశంలో పిల్లల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం - 2009 (రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్- ఆర్ టి ఈ ) అమలులో ఉంది. ఈ చట్టం ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కుగా కల్పించబడింది.ఆర్ టి ఈ చట్టం ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాల ల్లో కొన్ని సీట్లను కేటాయించే నిబంధనలు ఉన్నాయని అన్నారు .ఈ కార్యక్రమంలో డివిజన బిజెపి కమిటీ సభ్యులు మహిళా మోర్చా దళిత మోర్చా యువ మోర్చా ఓబీసీ మోర్చా గిరిజన మోర్చా అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

# ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్షుడిగా శ్రీపతి, ఉపాధ్యక్షుడిగా ఇంజమూరి రాజేందర్ గౌడ్**



**చేవెళ్ల జూన్ 21(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అవిశిపేట ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా శ్రీపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా గొల్లగూడ గ్రామానికి చెందిన ఇంజమూరి రాజేందర్ గౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మున్నూరు మహేందర్, కోశాధికారిగా తలారం దుద్దగు ఎండి నవాస్, కార్యదర్శిగా న్యాలట గోవర్ధన్ మధుసూదన్ రెడ్డిని ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా గుండ్ల శ్రీకాంత్, రావులపల్లి బూర్ల అనూష అంజనీకుమార్, సలహాదారులుగా అల్లూరు గ్రామానికి చెందిన మోకిల మనీషా, నవనీతం గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, గ్రామాల అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

# మనిషి మానసిక,శారీరక ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుంది

-- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

మైలార్దేవుపల్లి లోని ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

పాల్గొని యోగా ఆసనాలు వేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





రాజేంద్రనగర్, జూన్ 21 (ప్రజా జ్యోతి) మనిషి మానసిక,శారీరక ప్రశాంతతకు యోగా ఎంతగానో దోహదపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవుపల్లి లోని ఇండోర్ స్టేడియంలో శ్రీ వివేకానంద యోగా సేవాసమితి, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిబిరంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని యోగాసనాలు వేశారు. మాట్లాడు తూ ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాల్లో యోగా ఒకటి అన్నారు. మనిషి మానసిక,శారీరక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను పాటిస్తున్నాయి అన్నారు. మనస్సును,శరీరాన్ని ఏకం చేసి ఆధ్యాత్మిక తాదాత్మ్యం అందించేదే యోగా అని చెబుతారు. భారతదేశంలో వేద కాలం నుంచే యోగ ఉందని ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి. పరమ శివుడు మొదట తన పత్ని పార్వతికి యోగా గురించి వివరించాడని పురాణాలు చెప్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఉదయాన్నే యోగాసనాలు వేస్తూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.

## పేదలకు ఒక నీతి, పెద్దలకు మరో నీతి అన్నట్లుగా

# హైడ్రా వ్యవహరిస్తుంది

**రాజేంద్రనగర్, జూన్ 21 (ప్రజా జ్యోతి)** పేదలకు ఒక నీతి, పెద్దలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని హనుమాన్ నగర్ బస్తీలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో మాజీ మంత్రి టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా బస్తీ వాసులు దాదాపు 60 సంవత్సరాలుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న తమను బలవంతంగా తరలించి ఆ భూములు ప్రభుత్వం అమ్మేసుకోవాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పట్టాలను కూడా రద్దు చేసి తమ భూములను లాక్కోవాలని కుట్ర చేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.
సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరు రాలేదన్నారు. ఇప్పుడు అలవి కానీ



హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయాల్సింది పోయి ప్రజలందరూ కూల్చే పనిలో పడ్డాడు అన్నారు. ఈ ప్రభుత్వానికి సగం కాలం పూర్తయిందని, కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేకుండా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్నాయి అని, హైదరాబాద్ నగరంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. హనుమాన్ నగర్ బస్తీ మూసికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. స్థానిక ప్రజల ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు అని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలుగు తేటలు కూడా లేవన్నారు. ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి మళ్లీ రాబోయేది మన బిఆర్ఎస్ ప్రభుత్వం వేయాలి హామీ ఇచ్చారు. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాది అన్నారు. ఈ ఒక్క సంవత్సరం పాటు మీరే కాపాడుకోండి కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దన్నారు. పేదలకు ఒక నీతి పెద్దలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తుందన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి ప్రస్తుతం వచ్చిందన్నారు. మేమంతా మీకు అండగా ఉంటాం ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. మన బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక మీ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మి గూడ రాజీవ్ గృహకల్పలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో ధర్నా





యేళ్ల తరబడి త్రాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం
ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు
రాజీవ్ గృహకల్ప ప్రజలు
ధర్నాకు సంఘీభావం తెలిపిన బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, జూన్ 21 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవుపల్లి డివిజన్ లక్ష్మీగుడా రాజీవ్ గృహకల్ప (పింక్ క్వాటర్స్) ప్రాంతంలో ప్రజలు ఎన్నో ఏళ్లగా త్రాగునీరు, భూగర్భ డ్రైనేజీ సమస్యలు పై అధికారులకు ఎన్ని మార్లు విజ్ఞప్తి చేసుకున్న వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోకపోగా సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఆదివారం కాలి బిందెలతో రాజీవ్ గృహకల్ప ముందు ధర్నాకు దిగారు. రాజీవ్ గృహకల్పలో ఉన్న ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న ధర్నాకు బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అక్కడికి చేరుకొని ధర్నాకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ త్రాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే దిగివచ్చే ప్రజలకు తగు నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు ఓటేసి జనాలంటే ఎంత తేలికగా చులకనగా కనిపిస్తున్నారని అన్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న ఒక్కసారైనా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ కాలనీకి వచ్చిండా ప్రశ్నించారు. ఈ కాలనీలో సుమారు 36 కుటుంబాలు క్వార్టర్స్ సుమారు 900 కుటుంబాలు ఈ పరిస్థితులలో నివసిస్తుంటే ఈ పేద కుటుంబాలంటే జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులకు పట్టింపు లేదా అని ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఈ కాలనీ మంచినీటికి ఇంత అవస్థలు పడుతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బిందెలు పట్టుకొని మంచి నీటి కోసం అవస్థలు పడుతున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం కంటికి కనిపిస్తుంది అన్నారు.వెంటనే ప్రభుత్వ దిగివచ్చి ప్రజలకు మంచినీటి సరఫరా చేయాలని లేకపోతే మేము స్థానిక ప్రజలు అందరం కలిసి జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ధర్నా చేపట్టి మీరు ఎలా విధులు నిర్వహిస్తారో చూస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, బుచ్చి రెడ్డి, రావుల భాస్కర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, తలారి చిన్న, బబ్లూ, నర్సి రెడ్డి, ఎల్ రెడ్డి, పృధ్వీ రాజ్, అడికే శివ, నర్సింహ రెడ్డి, సచిన్, అంజమ్మ, లత, యాదమ్మ, పద్మ, పుష్ప, బి. రామ కృష్ణ, ఎన్ను శంకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, చెన్నయ్య, రవి, సురేష్, స్థానికులు మహిళలు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొన్నారు.

## ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం

--బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి
మైలార్దేవుపల్లి బాబుల్ రెడ్డి నగర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**రాజేంద్రనగర్, జూన్ 21 (ప్రజా జ్యోతి)** ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని బిజెపి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్,మాజీ కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన, అభివృద్ధి ఆధారిత పాలన విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ఆదివారం కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జై గురుదేవ్ యోగ గ్రూప్ గురువు విజయకుమార్, విమల నేతృత్వంలో బాబుల్ రెడ్డి నగర్ లోని బొద్రాయి చౌరస్తాలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్,మాజీ కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ముందుగా అంతర్జాతీయ యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు యోగాసనాలు యోగానిది శరీర త్వానికి శరీరకంగా మానసికంగా బలంగా ఉండడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. యోగ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, యోగ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా మనం పూర్తిగా పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకటరమణ, రావుల భాస్కర్,మురలీధర్ రెడ్డి, సంతు గౌడ్, మధుసూదన్ రెడ్డి, రామారావు, శేఖర్, రమేష్ రెడ్డి, శంకర్, రాజు, స్వామి, కిరణ్, రాజలింగం, శంకర్ రెడ్డి, బస్తీ లోని నాయకులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులకు ఆహ్వానం





**బోయిన్ పల్లి,జూన్ 21.(ప్రజా జ్యోతి):** ఓల్డ్ బోయిన్‌పల్లిలో అస్మత్ పేట్ ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ శివ దుర్గ ఎల్లమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తో పాటు ఆయన సతీమణి నందిని భట్టి దంపతులను టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, ఓల్డ్ బోయిన్‌పల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్ దండుగుల అమూల్య మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించనున్న మూడు రోజుల ధార్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, మహా అన్నదాన కార్యక్రమాల వివరాలను ఉప ముఖ్యమంత్రికి వివరించి, మహోత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన భట్టి విక్రమార్క దంపతులు మహోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువతి దుర్మరణం



**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 21(ప్రజాజ్యోతి)** ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువతి దుర్మరణం పాలైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొయ్యల ప్రత్యూష (20) వనస్థలిపురం లోని యూని సెక్స్ సెలూన్ యందు బ్యూటీషియన్ గా పనిచేస్తుంది. శనివారం రాత్రి 8:45 నిమిషాలకు తన పని ముగించుకొని తన స్కూటీ ( ఏపీ 29 బి ఎన్ 7372) పై ఇంటికి వెళ్లేందుకు బయలుదేరి హయత్ నగర్ తొర్రూర్ రోడ్డు లోని సాయిబాబా గుడి ఎదురుగా వినాయక నగర్ కాలనీ వద్దకు చేరుకోగానే ఆర్టీసీ బస్సు( టీఎస్ 09 జెడ్ 7894) డ్రైవర్ వెనుక వైపు నుండి బలంగా ఢీకొట్టడంతో ప్రత్యూష స్కూటీ పైనుండి రోడ్డుపై పడిపోవడంతో ఆర్టీసీ బస్సు చాతి పై నుండి వెళ్ళింది. తీవ్ర గాయాల పాలైన ప్రత్యూషను స్థానికంగా ఉన్న కొందరు హయత్ నగర్ లోని సన్రైజ్ హాస్పిటల్ కు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని డ్యూటీలో ఉన్న డాక్టర్లు తెలిపారు. కాగా ప్రత్యూష గ్రేస్ చిల్డ్రన్ స్కూల్ లోని హాస్టల్లో వంటపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది.తన కూతురు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ జనికల వెంకటేశ్వర్లు పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్యూష తండ్రి బాలయ్య హయత్ నగర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శంకరయ్య పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.

## రాజరాజేశ్వరి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా ముద్దం నర్సింహ యాదవ్ ఎన్నిక

నూతన కమిటీ సభ్యులకు శాలువాలతో ఘన సన్మానం



**బోయిన్ పల్లి, జూన్ 21 (ప్రజా జ్యోతి):** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని రాజరాజేశ్వరి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్ నెం.10లో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కమిటీ సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎస్. చక్రపాణి, జనరల్ సెక్రటరీలుగా శ్రీనివాసరావు, మీనాక్షి పవర్, జాయింట్ సెక్రటరీలుగా బిట్ల వెంకటేశ్వరరావు, సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అమర్ సింగ్, ట్రెజరర్‌గా దిలీప్ రాజన్‌తో పాటు 11 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే, రాజరాజేశ్వరి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అడ్వైజర్లుగా వెంకటపతి రాజు, బాబు ఓడినే, కృష్ణారెడ్డిలను నియమించారు.ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధి, నివాసితుల సంక్షేమం కోసం అసోసియేషన్ సభ్యులందరూ సమిష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమని విద్యార్థులకు పిలుపు





**కూకట్ పల్లి, జూన్ 21 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జేఎన్‌టీయూహెచ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేస్తూ యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ దీపిక మాట్లాడుతూ, యోగా భారతదేశానికి ప్రపంచానికి అందించిన అమూల్యమైన పురాతన విద్య అని పేర్కొన్నారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది మనిషి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంపొందించే జీవన విధానమని వివరించారు. ప్రస్తుత కాలంలో యువత అనేక ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో యోగా అత్యంత అవసరమని ఆమె అన్నారు. ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా యువత శారీరకంగా దృఢంగా, మానసికంగా స్థిరంగా తయారై సమాజం, దేశాభివృద్ధికి తమ వంతు సేవ చేయగలరని సూచించారు. ఆరోగ్యవంతమైన యువతే బలమైన భారతదేశ నిర్మాణానికి పునాది అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు యోగా సాధన ద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, సానుకూల ఆలోచనా విధానం పెంపొందుతాయని అభిప్రాయపడ్డారు. యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ నవదీప్, స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్ దుర్గాప్రసాద్, అంజలి, సాయిరామ్, సాయితేజ, తరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీకి చెందిన పలువురు విద్యార్థులు ఉత్సాహంగా హాజరై యోగా సాధనలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్నూరుకాపుల ఐక్యతకు అందరం కృషి చేద్దాం





**--రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్**

**శామీర్ పేట్ జూన్ 21,(ప్రజాజ్యోతి)** రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపుల ఐక్యతకు అందరం కృషి చేద్దామని రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని శుభం గార్డెన్స్ లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్నూరుకాపుల యువకమండలి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మున్నూరుకాపు రాష్ట్ర సంఘం అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ పటేల్, ఎన్నికల నిర్వహణ అధికారి ఆకుల సత్యనారాయణ పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా కులాన్ని అభివృద్ధి చేసుకోవాలి

కుల ఐక్యత గురించి అందరంకృషి చేయాలి

గతంలో బి ఆర్ ఎస్ ఐదు ఎకరాలు భూమి ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా కార్పొరేషన్ కు 5కోట్ల రూపాయలు ఇచ్చిందని అని తెలిపారు. పదవి ఇచ్చినప్పుడు మున్నూరుకాపుల ఆకాంక్షలను నెరవేర్చలసిన అవసరం ఉంటదనీ నాకు తెలుసు అందరం కలిస్తేనే అయితది కార్పొరేషన్ కోసం కుల పెద్దలు కృషి చేశారని గుర్తుచేశారు. అవసరం ఉన్నప్పుడు అందరం ఒకటి కావాలని కార్పొరేషన్ ఆఫీస్ ఏర్పాటు చేశాక అందరిని పిలిచి ఎక్కతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తానని అందరం ఎకతాటిపైకి రావాలని సూచించారు. కులం బలంగా ఉంటేనే రాజకీయ అవకాశాలు వస్తాయని ఏ కార్యక్రమం అయినా పెన్నుకు సంబంధించిన నాయకులు అన్ని కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళదామని అన్నారు. అనంతరం జిల్లా యువకమండలి అధ్యక్షుడుగా ఎన్నికైన ఆకుల యశ్వంత్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ పటేల్, ఉపాధ్యక్షులుగా బోగారం నరేష్ పటేల్, పూజారి మహేష్ పటేల్ తదితరులతోపాటు యువకమండలి సభ్యులకు నియామక పత్రం అందజేసిన మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఎన్నికల నిర్వహణ అధికారి ఆకుల సత్యనారాయణ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగ్ రావు పటేల్ లక్ష్మాపూర్ మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి 30వేల రూపాయలు విరాళం అందజేశారు.

ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్, పెన్ నిర్వాహకులు పి ఎల్ ఎన్ పటేల్, బేతి శ్రీధర్ పటేల్, కాంగ్రెస్ నాయకులు తూము వినయ్ పటేల్, పెద్దలు ఆకుల రాజు పటేల్ , బుద్ధి సత్తయ్య పటేల్ , రాజశేఖర్ పటేల్ , ఆకుల సురేష్ పటేల్, బిక్షపతి పటేల్, వివిధ మండలాల అధ్యక్షులు చిందం మహేందర్ పటేల్, వేల్పుల శ్రీనివాస్ పటేల్, కటికం రాజు పటేల్,జిల్లా కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్ పటేల్, వైల ఎల్లయ్య పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# నేమూరి విష్ణువర్ధన్ గౌడ్ ఆకస్మిక మృతి

నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

పార్థివదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

పాడే మోసి తుది వీడ్కోలు పలికిన వజ్రేష్ యాదవ్



**శామీర్ పేట్, జూన్ 21,(ప్రజాజ్యోతి)** ఉద్దెమర్రి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నేమూరి విష్ణువర్ధన్ గౌడ్ ఆకస్మిక మరణం పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విష్ణు గౌడ్ మరణవార్త తెలిసిన వెంటనే ఆదివారం ఆయన పలువురు ముఖ్య నాయకులతో కలిసి ఉద్దెమర్రి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ విష్ణువర్ధన్ గౌడ్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొని, శ్మశాన వాటిక వరకు పాడె మోసి ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

**పార్టీకి తీరని లోటు......**

**తోటకూర వజ్రేష్ యాదవ్**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నేమురి విష్ణు వర్ధన్ గౌడ్ చేసిన పోరాటాలు, ప్రజల సమస్యల పట్ల ఆయనకు ఉన్న అంకితభావం ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఒక క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా ఆయన చేసిన అపారమైన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన మరణం పార్టీకి, స్థానిక ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విష్ణు గౌడ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అత్యంత కష్టతరమైన ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ విష్ణు వర్ధన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నర్సిములు యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ,మూడు చింతల పల్లి, అలియాబాద్ మున్సిపాలిటీల చైర్మన్ లు జాం రవి, కంఠం శిరీష కృష్ణారెడ్డి,శామీర్ పేట సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఎంసీ పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్,తూము కుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఉద్దెమర్రి గ్రామ ప్రజలతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## తెలంగాణ ఉద్యమ ప్రేరణదాత జయశంకర్‌ను స్మరించిన నేతలు



**అల్వాల్ జూన్ 21 ప్రజా జ్యోతి** అల్వాల్ సర్కిల్ లో తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి 15వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన స్మారక కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ గారు చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ డోలి రమేష్, నేమూరి శ్రీధర్ గౌడ్, టీయూఎఫ్ మల్కాజ్‌గిరి నియోజకవర్గ అధ్యక్షుడు పుట్నాల కృష్ణతో పాటు మందా శోభన్, మహేష్, సుధీర్, సంతోష్, జామ లక్ష్మణ్, రామయ్య, ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి, జావేద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ వెలుగు

- ఎమ్మెల్యే కాలే యాదయ్య

- మడికట్టు గ్రామం,చేవెళ్ల మున్సిపల్ ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**చేవెళ్ల జూన్ 21(ప్రజా జ్యోతి):** అర్హులైన పేదింటి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి అనుబంధ గ్రామం మడికట్టులో దేవరి మల్లేష్ చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దండు ఇందిరమ్మ నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారి ఆర్థిక మరియు సామాజిక స్థితిగతులను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి కుటుంబం సొంత ఇంటిలో సంతోషంగా జీవించే రోజులు ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడం సంతోషకరమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, తంగడపల్లి సర్పంచ్ పామేన రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, సర్పంచులు ముత్తంగి లావణ్య రాజశేఖర్, డిసిసి ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, కౌన్సిలర్లు తాళ్లపల్లి నర్సింలు, శైలజ ఆగి రెడ్డి, ధవల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, బుర్ల మహేష్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు యాదవ్, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యం ఆనందమయం జీవితం




**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 21(ప్రజాజ్యోతి)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ గ్రౌండ్ లో 53,56 వ జిహెచ్ఎంసి బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్,రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్ తో కలిసి పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం చేయడం జరిగింది. యోగాకోసం ప్రతి ఒక్కరూ వారి జీవితాల్లో ప్రతి రోజు కొద్ది సమయం కేటాయించి మానసికంగా మరియు శారీరకంగా బలంగా తయారవ్వాలని కోరడం జరిగింది. ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతో దోహదపడుతుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్త రామ్ రెడ్డి, బాచిగాళ్ళ రమేష్, కొండ్రు పురుషోత్తం, తుళ్ల నరసింహ గౌడ్, పలుస శ్రవణ్ గౌడ్, డాక్టర్ సురేష్, నందగిరి సురేష్, కోలన్ రవీందర్ రెడ్డి గుండా కృష్ణ, నాగరాజు, కాంచమోని దాసు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ప్రతి మనిషికి అవసరం

టిడిపి కార్యాలయంలో యోగా డే వేడుకలు



**హైదరాబాద్** నేటి మనిషి బిజీ జీవన విధానానికి యోగా పరిపూర్ణ ప్రశాంతతను ఇస్తుందని టిడిపి పోలీట్ బ్యూరో బక్కని నర్సింహులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సంధర్భంగా తెలంగాణ టిడిపి రాష్ట్ర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రపంచ దేశాలు సైతం యోగా కోసం భారతదేశం వైపు చూడడం గర్వకారణమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకొవాలని అన్నారు. నేటి యువత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఆరోగ్య విషయంలో స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు. ఆయన ప్రతిరోజు యోగాను తన జీవితంలో ప్రధాన భాగం చేసుకున్నాడని తెలిపారు. యోగా శిక్షకురాలు సామల లక్ష్మి శ్యామల వివిధ ఆసనాలు వేపించారు. ఈ వేడుకలలో టిటిడి మెంబర్ నర్సిరెడ్డి. ఎన్టీఆర్ ట్రస్ట్ ఎండీ గోపి, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అల్వాల్ మాచబొల్లారంలో ఆర్‌యూబీ పనుల పరిశీలన..

ప్రజలకు త్వరలో ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం





**అల్వాల్, జూన్ 21 ప్రజా జ్యోతి** అల్వాల్ మాచబొల్లారం ప్రాంతంలోని రాజీవ్ రహదారి రోడ్, అల్వాల్--సెలెక్ట్ టాకీస్ రోడ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనులను ఈరోజు పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే మాచబొల్లారం, అల్వాల్, సుచిత్రతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. అలాగే ట్రాఫిక్ రద్దీ సమస్యకు గణనీయమైన పరిష్కారం లభించనుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు ఈ కీలక ప్రాజెక్టు ప్రారంభానికి సహకరించిన రైల్వే శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని గుర్తించి చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమం త్వరగా పూర్తవాలని ఆకాంక్షించారు. ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయిన తర్వాత వేలాది మంది ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, లడ్డూ రెడ్డి, శ్రీశైలం యాదవ్, సంపత్ యాదవ్, వెంకటేష్ గౌడ్, రాజేందర్ యాదవ్, రమేష్, ఆనంద్, కొండల్ రెడ్డి, డి. స్వామి, శంకర్, నవీన్, శ్రీను, నరేష్ రెడ్డి, సందీప్ రెడ్డి, సురేందర్, దేవా, బబ్లూ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాచబొల్లారం ఎంఎంసీ డివిజన్ 190, 191 ఇన్‌చార్జి మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ హాజరై పనుల పురోగతిని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

# చేవెళ్ల సొసైటీ గోదాంలో యూరియా, డీఏపీ

**- ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులు పొందాలి**

**- సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి**



**చేవెళ్ల జూన్ 21(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మండల రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు చేవెళ్ల సొసైటీ గోదాంలో అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో నమోదు చేసుకుని ఎరువులు పొందాలని కోరారు. రైతులు ఆధార్, ఇతర వివరాలతో యాప్‌లో బుకింగ్ చేసుకుని సొసైటీ గోదాం నుంచి యూరియా, డీఏపీ తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందించేందుకు సొసైటీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రైతులందరూ ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని పంటల దిగుబడిని పెంచుకోవాలని చైర్మన్ దేవర వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# భారీగా నాటుసారా ముడిసరుకు పట్టివేత

**- నలుగురిపై కేసు,ఒకరు అరెస్ట్**



**తలకొండపల్లి,జూన్21 (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత,గుడుంబా రహిత తెలంగాణ సాధనలో భాగంగా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆమన్‌గల్,తలకొండపల్లి కడ్తాల్,మాడ్గుల్ మండలాల వ్యాప్తంగా ముమ్మర దాడులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ అధికారులు ఆదివారం కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద భారీగా నాటుసారా తయారీ ముడిసరుకును పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ మరియు రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ ఆదేశాల మేరకు ఆమనగల్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో గంజాయి,నాటుసారా స్థావరాలపై ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా కర్ణాటక రాష్ట్రం బీదర్ నుండి నల్ల బెల్లం,పటిక అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఎక్సైజ్ సీఐ భద్యానాథ్ చౌహాన్ నేతృత్వంలో సిబ్బంది కడ్తాల్ టోల్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో టిఎస్ 05 యూబి 5600 నంబర్ గల బొలెరో పికప్ వాహనంలో 30 కిలోల చొప్పున 40 బస్తాలు,మొత్తం 1200 కిలోల నల్ల బెల్లం,50 కిలోల పటిక బస్తా కూడా గుర్తించారు. వీటితో పాటు ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ భద్యానాథ్ చౌహాన్ తెలిపారు. పట్టుబడిన డ్రైవర్ పిట్ల రాజు నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం బాపూజీనగర్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా..నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన మున్నా అనే వ్యక్తి ఈ సరుకును తెప్పిస్తున్నట్లు వెల్లడించాడు. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులను గుర్తించారు. ఏ1.పిట్ల రాజు అరెస్ట్ కాగా ఏ2.ఓర్సు శివ,ఏ3.మున్నా ఏ4.ఆలకుంట దుర్గయ్య పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారిలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని,త్వరలోనే వారిని అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ సీఐ భద్యానాథ్ చౌహాన్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ నల్ల బెల్లం 1200 కిలోలు,పటిక 50 కిలోలు,బొలెరో పికప్ వాహనంతో కలిపి సుమారు రూ. 4 లక్షల విలువ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న డ్రగ్స్,గుడుంబా రహిత తెలంగాణ కోసం దాడులు మరింత ముమ్మరం చేస్తామని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. నాటుసారా,గంజాయి సమాచారం ఉంటే వెంటనే తమకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాడుల్లో పాల్గొన్న సిబ్బంది ఎక్సైజ్ సీఐ భద్యానాథ్ చౌహాన్,ఎస్ఐ కృష్ణ ప్రసాద్,ఈసీలు లింగయ్య,శివప్రసాద్, రాంరెడ్డి,అమని,షాబాజ్ అహ్మద్,శ్రీను,ఉపేందర్ తనిఖీల్లో పాల్గొన్నారు.

# ఫామ్‌హౌస్‌లో విషాదం.. పెంకులు కూలి కూలీ మృతి

**- కమ్మెటలో ఘటన.. మరో వ్యక్తికి గాయాలు**

**చేవెళ్ల జూన్ 21(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మండలం కమ్మెట గ్రామ పరిధిలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఫామ్‌హౌస్‌లో కూలీ పనులు చేస్తుండగా పెంకులు కూలిపోవడంతో రాజస్థాన్‌కు చెందిన ప్రదీప్ సింగ్ (వ్యక్తి) మృతి చెందాడు. మరో వ్యక్తి శిశుపాల్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన పవన్ సింగ్, షాపు సింగ్, ప్రదీప్ సింగ్, శిశుపాల్ కొంతకాలం క్రితం తెలంగాణకు వచ్చి కూలీ పనులు చేస్తున్నారు. కమ్మెట గ్రామ పరిధిలోని ఓ ఫామ్‌హౌస్‌లో పనిచేస్తుండగా ప్రదీప్ సింగ్, శిశుపాల్ పైభాగంలో ఉండగా, మిగతా ఇద్దరు కింద ఉన్నారు.

ఈ సమయంలో ఒక్కసారిగా పెంకులు కూలిపోవడంతో పైభాగంలో ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. ప్రమాదంలో ప్రదీప్ సింగ్‌కు ముఖం, కడుపు భాగంలో తీవ్ర గాయాలు కాగా.. శిశుపాల్‌కు కాళ్లు, శరీరంలోని ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రదీప్ సింగ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కూకట్ పల్లి లో ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవం

**యోగ ద్వారా ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలబడుతుంది**

**భారతీయ యోగా సంస్థాన శివసిద్ధి కుండలని సభ్యులు**

**కూకట్ పల్లి, జూన్ 21 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని భారతీయ యోగా సంస్థాన శివసిద్ధి కుండలని సభ్యుల ఆధ్వర్యంలో బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డ్ హౌసింగ్ బోర్డ్ లో కాలనీ ఫ్రీడం పార్కులో యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నిత్యం యోగ ను పాటించడం వలన ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవాటు అవుతుందని పేర్కొన్నారు. శ్వాసను నియంత్రించడం వలన శరీరంలోని ప్రతి అవయవాన్ని మన ఆధీనంలో ఉంచుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా నిత్యం మానసిక ఒత్తిడి, వృత్తిపరమైన ఒత్తిడి నుండి ఉపశమనం కలగడానికి యోగ గొప్ప ఔషధమని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిత్యం యోగ ను అభ్యసించడం వలన మానసిక ఉల్లాసప పాటు, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు.

# అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా నిర్వహణ

**యోగను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి : యోగ గురువు నూనె వెంకటేష్ ముదిరాజ్**



**మొయినాబాద్: జూన్ 21 (ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ హర్ష క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువు నూనె వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా నూనె వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ యోగతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే యోగను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వాల్లో యోగ ఒకటని పేర్కొన్నారు. యోగ ద్వారా



శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతాయని, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అనంతరం హిమాయత్‌నగర్ యోగ గ్రూప్ సభ్యులు, కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్‌తో కలిసి యోగ గురువు నూనె వెంకటేష్ ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. చిన్నప్పటి నుంచే యోగపై ఆసక్తి పెంచుకున్న ఆయన 60 ఏళ్లు దాటినప్పటికీ ప్రతిరోజూ యోగ సాధన చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైకని భిక్షపతి, కుశంగల నందు, బీసా శ్రీశైలం, దేవులపల్లి వెంకటేష్ గౌడ్, షబ్బీర్, కుమ్మరి వెంకటస్వామి, కబీర్, కుమ్మరి పాండు, దేవులపల్లి రాజుగౌడ్, కుమ్మరి రవి, బీసా శ్రీనివాస్, ఆంగోత్ చందు, బుర్రకాయల రాజు, కుమ్మరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**తాండూర్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో తాండూర్ మండల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, తాండూర్ పీహెచ్‌సీ ఆయష్ దవాఖానలో డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సామూహిక యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వాటి ప్రయోజనాలు గురించి యోగా శిక్షకులు, పీఈటీ తొగరి శ్రీనివాస్, ఉప్పుట్ల చందు అవగాహన కల్పించి కొన్ని ముఖ్యమైన ఆసనాలను కార్యక్రమానికి హాజరైన వారితో వేయించారు. యోగా సాదనతో అనేక శారీరక రుగ్మతలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. నిత్యం యోగా సాధనతో మన శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పని చేసి వ్యాదులను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# వానలు కురవాలని హిమ్మత్‌నగర్‌లో కప్పతల్లి ఆడిన గ్రామస్తులు

**వీణవంక :** వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో ఆదివారం వానలు కురవాలని కోరుతూ సర్పంచ్ జడల శ్రీకాంత్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దలు అందరూ కలిసి కప్పతల్లి ఆట ఆడి, ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు బిందెలతో నీళ్లు ఎత్తుకొని గ్రామంలోని బొడ్రాయి, హనుమాన్, పోచమ్మతల్లి దేవాలయాల్లో విగ్రహాలకు నీళ్లు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగుకాలం దాటిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ గ్రామంలో కప్పతల్లి ఆడి, గ్రామంలోని దేవతలందరికీ ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాక శ్రీనివాస్, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ నల్ల తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు గెల్లు రమేష్, కర్ణకంటి భాస్కర్‌రెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, రఘువరన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో ఆకట్టుకున్న సామూహిక యోగాసనాలు

**కోల్ :** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ఆర్యవైశ్య భవన్ లో ఆదివారం నిర్వహించిన సామూహిక యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యాంత్రిక జీవనంలో ఆరోగ్యమే మహాభాగ్యమని సందేశాన్ని ప్రజల్లో స్ఫూర్తి కలిగించేలా వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి యోగసానాలతో ఆకట్టుకున్నారు. ఆమె మాట్లాడుతూ యోగ అనేది వ్యాయామం మాత్రమే కాదనీ, మనిషి శరీరం, మనసు, ఆత్మను ఏకం

# నిరుపేదల ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత



**తలకొండపల్లి జూన్21 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నిర్మిస్తున్న పూర్తి ఇండ్లు,అసంపూర్తి ఇండ్ల నిర్మాణంలో భాగంగా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల జంగయ్య తండ్రి పాపాయ్య ఇంటి నిర్మాణానికి రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇండ్ల నిర్మాణంలో భాగంగా పూర్తి ఇంటి నిర్మాణానికి ఆదివారం సిమెంట్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య,ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్,నాయకులు మల్లేష్,పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన కౌన్సిలర్



**చేవెళ్ల జూన్ 21(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో దేవుని ఎర్రవల్లి 3 వ వార్డులో హరిజన్ స్వప్న నర్సింలు దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం కౌన్సిలర్ కరికె మీనాక్షి సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీర శ్రీనివాస్, సామ విట్టల్ రెడ్డి, బస్తే పురం శ్రీశైలం, సామా మాణిక్య రెడ్డి, కంకంటి శ్యామలయ్య, మంగలి నరసింహులు, ఎదిరే రాములు, చాకలి పాండు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



**తలకొండపల్లి జూన్21 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని లింగరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన బండగల్ల లక్ష్మమ్మ ఇటీవల అకస్మాత్తుగా పరమపదము. ఈ విషయం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భరోసా ఇవ్వడం జరిగింది. అనంతరం తక్షణ సహాయంగా రూ.10వేల రూపాయలు బాధిత కుటుంబనికి చెందిన కుమారుడు మహేష్ కి అందించడం జరిగింది. అలాగే గ్రామ ఉప సర్పంచ్ భూత్కూరి వెంకట్ రెడ్డి బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యం,మాజీ సర్పంచ్ జీనుకుంట్ల శ్రీనివాస్ గౌడ్ రూ.2వేల రూపాయలు అందిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డితో పాటు వార్డు సభ్యులు రాజమౌని భాగ్య,బొచ్చుపల్లి శేఖర్,బండగల్ల జంగయ్య,తిరుపతి గౌడ్,రాములు,ప్రమోద్,మహేష్,మహేందర్,రబ్బానీ తదితరులు ఉన్నారు.

# కనకమామిడిలో సీసీ రోడ్డు పనుల పరిశీలన

**మొయినాబాద్, జూన్ 21 (ప్రజా జ్యోతి):** మొయినాబాద్ మండలంలోని కనకమామిడి గేట్ నుండి గ్రామం వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన ఆయన, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని



సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రహదారుల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గణేష్ రెడ్డి, ప్రవీణ్,బాల మల్లేష్,వార్డు సభ్యులు, రామ్ రెడ్డి,మాల్ రెడ్డి,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు. వారు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించి, గ్రామ అభివృద్ధికి అవసరమైన ఇతర పనులను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనకమామిడి గ్రామంలో జరుగుతున్న ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తగ్గనున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# నియోజకవర్గం అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..!

**మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డికి కాంగ్రెస్ నేతల సవాల్.!**

**ప్రాంతాభివృద్ధికి సీఎం వస్తే ఓర్వలేకపోతున్న గులాబీ నాయకులు**

**ఆరుట్ల స్కూల్ ను సందర్శిస్తే రూపురేఖలు ఎలా మార్చామో తెలుస్తోంది...**

**అభివృద్ధి అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఈ సారి డిపాజిట్లు గల్లంతు...**

**ఈ ప్రాంత అభివృద్ధికి తపనపడే వ్యక్తి మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఎమ్మెల్యే రంగారెడ్డిపై లేనిపోని విధంగా మాట్లాడితే సహించేదిలేదు**

**నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు..**



**ఇబ్రహీంపట్నం జూన్ 21 ప్రజాజ్యోతి:** 14ఏళ్లలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధిపై, రెండున్నరేళ్లలో మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై దమ్మొంటే చర్చకు రావాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ప్రజాప్రభుత్వంలో మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రాజకీయాలకతీతంగా కేటాయిస్తున్న నిధుల గురించి బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ లనే అడగాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి... శనివారం కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను వారు తిప్పికొట్టారు. ఈ మేరకు ఇబ్రహీపట్నంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ఏదుల్లా పాండురంగారెడ్డి, వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్ రెడ్డి, 'ఏ' బ్లాక్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎద్మ నరేంద్ రెడ్డి, లింగం ముదిరాజ్, ఇబ్రహీంపట్నం టౌన్ అధ్యక్షుడు గౌస్ పాష, కొంగర, తొర్రూర్, తుర్కయంజాల్ డివిజన్ల అధ్యక్షులు రమేశ్ ముదిరాజ్, అయిలయ్య, శ్రీనివాస్, కౌన్సిలర్లు నీళ్ల భానుబాబు, రాందాస్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రైతుల గురించి మొసలి కన్నీరు కార్చుతున్న కిషన్ రెడ్డి.... రెండు పర్యాయాలు బీఆర్ఎస్ హయాంలో చేసిన రుణమాఫీ, ధాన్యం కొనుగోలు గురించి గుర్తు చేసుకోవాలి. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే ఒకేసారి 2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ధాన్యం కొనుగోలు చేయలేదని మాట్లాడుతున్నారు. మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో 10కేంద్రాలుంటే ఇప్పుడు మా ఎమ్మెల్యే ఆదేశాలతో 15కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయటం జరిగింది. ఒక్క బస్తా ధాన్యం కూడా తడవకుండా కొనుగోలు జరిగిందంటే, మేము చేసిన పకడ్బందీ చర్యలే ఇందుకు నిదర్శనం. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు మీ హయాంలో ఎప్పుడు రైతులకు అందుతాయో తెలియని దౌర్భాగ్యం. అదే ఇప్పుడు 72గంటల్లో రైతుల ఖాతాల్లో వేస్తున్నది నిజం కాదా అడిగి తెలుసుకోండి. రైతుబంధు పేరుతో బీఆర్ఎస్ వ్యాపారులు కోట్ల రూపాయలు కొల్లగొడుతుంటే, అసలైన రైతులను గుర్తించి, రైతుభరోసా పేరుతో 12వేల రూపాయలు పెట్టుబడి సాయం మా ప్రభుత్వం అందిస్తోంది.

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సీఎంను నిధులు అడగలేదనడం సిగ్గుచేటు...**

9ఏళ్లలో ముఖ్యమంత్రి అపాయిట్మెంట్ మీకు ఒక్కసారైనా దొరికిందా. ఓట్ల కోసం తప్పితే కేసీఆర్ ను ఏనాడైనా ఇబ్రహీంపట్నం తీసుకువచ్చారా, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటారు. 15రోజుల్లోనే 4సార్లు సీఎంను నియోజకవర్గానికి తీసుకువచ్చిన ఘనత ఆయనది. ఈ కడుపుమంటతోనే మీరు మాట్లాడుతున్నారు.

**విద్యారంగంలో మార్పునకు ఆరుట్ల నుంచి శ్రీకారం...**

విద్యరంగంలో మార్పునకు ఆరుట్ల నుంచి శ్రీకారం చుడుతుంటే, ఓర్వలేని గులాబీ మూకలు లేని వీడియోలు సృష్టించి, మా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పేద పిల్లల భవిష్యత్ కోసం చేసే ప్రయత్నాలను కూడా మీరు ఓర్వలేకపోతున్నారు. ఒక్కసారి సబితారెడ్డి, కిషన్ రెడ్డి.... మీ మనవలుమనవరాళ్లతో ఆరుట్ల స్కూల్ను సందర్శిస్తే, దానిని ఎంత గొప్పగా తీర్చిదిద్దామో ఆ పిల్లలే మీకు చెబుతారు.

**కోహెడలో మార్కెట్ కు స్థలం కేటాయిస్తే, పదేళ్లు ఏం చేశారు?**

అప్పట్లో మా కాంగ్రెస్ ప్రభుత్వమే కోహెడలో మార్కెట్ కు స్థలం కేటాయిస్తే, పదేళ్లు ఏం చేశారు? నియోజకవర్గ రూపురేఖలు మార్చే క్రమంలో ఫార్మా సిటీ స్థానంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తుంటే, మళ్లీ ఫార్మా తెస్తామంటున్నారు. ఇదే తీరుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి ఉండదు. రోజూ ఇబ్రహీంపట్నం చెరువుకట్టపై నుంచి వెళ్తుంటే అభివృద్ధి కనిపించటంలేదా...? 14ఏళ్లలో నియోజకవర్గానికి మీరు తెచ్చింది, రెండున్నరేళ్ల మా రంగారెడ్డి తెచ్చిన నిధుల విషయంపై దమ్మొంటే చర్చించేందుకు రండి.

**పదేళ్లలో నియోజకవర్గాన్ని ఆగమాగం చేశారు...**

పదేళ్లలో నియోజకవర్గానికి ఎంత విధ్వంసం చేశారో ప్రజలందరికీ తెలుసు కాబట్టే 40వేల ఓట్లతో రంగారెడ్డి గారిని గెలిపించారు. మా ఎమ్మెల్యే ఇప్పటి వరకు అభివృద్ధిపైనే దృష్టిసారించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల అండతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇక్కడి నాయకులు చేసిన అక్రమాలపై విచారణ జరిపించటంపై దృష్టి సారిస్తే ఒక్కరు కూడా బయట తిరిగే పరిస్థితి ఉండదు. ఉనికి కోసం లేనిపోని విధంగా మాట్లాడుతున్న కిషన్ రెడ్డి గారు... మీ కుటుంబంలో ఎవరికి టికెట్ వస్తుందో తేల్చుకుని వచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు గురించి మాట్లాడండి. నిత్యం ప్రజల కోసం, ఈ ప్రాంత అభివృద్ధికి తపనపడే ఎమ్మెల్యే రంగారెడ్డిపై లేనిపోని విధంగా మాట్లాడితే ఇకపై సహించేదిలేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు..

# ఆరోగ్యానికి యోగా.. చేవెళ్లలో ఆధ్యాత్మిక సందడి

**– అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సాముహిక యోగాసనాలు, ధ్యానం**



**చేవెళ్ల జూన్ 17(ప్రజా జ్యోతి):** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కెజీఆర్ గార్డెన్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యోగా గురువుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు, మెడిటేషన్ చేశారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగాను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్రెడ్డి, కౌన్సిలర్లు బండారు శైలజ, ఆగిరెడ్డి, మనీషా అనంతరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎం. యాదగిరి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు కుంచం శ్రీనివాస్ గుప్తా, డాక్టర్ వైభవ్ రెడ్డి, స్థానిక నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# దేవునిపడకల్ గ్రామంలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ





**తలకొండపల్లి జూన్21 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించి తలపెట్టిన పోచమ్మ దేవాలయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగింది. రాబోయే బోనాల పండగ వరకు పోచమ్మ దేవాలయాన్ని పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్లడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు, భక్తులు సహకరించాలని సర్పంచ్ కోరారు. గ్రామస్థులందరం కలిసి బోనాల పండగ వరకు పోచమ్మ దేవాలయాన్ని పూర్తి చేసేవిధంగా ప్రయత్నం చేద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్, ఉపసర్పంచ్ అంబటి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ రాజమోని తిరుపతి, అంబటి నర్సింహా, కుమ్మరి రవి, అంబటి వెంకటేష్, వార్డుసభ్యులు కడమోని రాము, రాజమోని జ్యోతి లక్ష్మయ్య, మద్దూరి మాధవి మహేష్, రాజమోని జంగయ్య, రాములు, ఏడ్ల. రాజు, పులిజాల వెంకటయ్య, వాలీబాల్ యూత్ ప్రెసిడెంట్ పులిజాల మహేష్ గౌడ్, మరియు గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మొయినాబాద్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులు

**మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు**

**ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ ముదిరాజ్**



**మొయినాబాద్, జూన్ 21 (ప్రజా జ్యోతి)** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించే లక్ష్యంతో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ ముదిరాజ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించి హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు గుర్తిస్తే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించడం తప్పనిసరి అని తెలిపారు. ప్రజల ప్రాణ రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

# వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

**సర్పంచ్ దేరంగుల శంకర్**

**బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ప్రారంభం**

**మహిళలకు చేతి సంచుల పంపిణీ**

**ప్లాంటుకు ఇంటి ఇంటి స్థలం కేటాయించిన లింగారెడ్డి**



యాచారం, జూన్ 21 (ప్రజాజ్యోతి): మల్కిజ్ గూడలో బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ను సర్పంచ్ దేరంగుల శంకర్ తో కలిసి బిఆర్ఆర్ ఫౌండర్ బూడిద రామిరెడ్డి ప్రారంభించారు. గుడ్డతో రూపొందించిన చేతి సంచులను మహిళలకు పంపిణీ చేశారు. సర్పంచ్ దేరంగుల శంకర్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ఏర్పాటు చేయడమే కాకుండా మరో ప్లాంట్ను కూడా అందజేస్తానని హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. గ్రామపంచాయతీకి కుర్చీలు, మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తానని ప్రకటించడం పట్ల గ్రామ ప్రజల తరఫున ఫౌండేషన్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బూడిద రామిరెడ్డి మాట్లాడుతూ.. తాగునీటికి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతోనే వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. ప్లాస్టిక్ నియంత్రించేందుకే జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశామని ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గ్రామసభ సమావేశాల్లో ప్రజలు కూర్చోవడానికి అవసరమైన కుర్చీలను అందజేస్తానని, కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తానని తెలిపారు. ప్రజా అవసరాల దృష్ట్యా అవసరాలను తన దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత మేర సహకరిస్తానని చెప్పారు. వాటర్ ఫిల్టర్ ప్లాంట్ ఏర్పాటుకు తన ఇంటి స్థలాన్ని అందించిన పల్లెర్ల లింగారెడ్డికి బూడిద రామిరెడ్డి, సర్పంచ్ శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని బిఆర్ఆర్ ఫౌండేషన్కు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

# యోగ మానసిక ప్రశాంతతనిస్తుంది

**సర్పంచ్ నాగరాజు యాదవ్**




**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) జూన్ 21 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని మందిపాల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ నాగరాజ్ యాదవ్, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు రామచందర్ ఆధ్వర్యంలో యోగ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. యోగ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి రామచందర్, గ్రామ సర్పంచ్ నాగరాజ్ యాదవ్ మాట్లాడుతూ. యోగ భారతీయ జీవన విధానంలో శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక సమతుల్యతను సాధించడానికి ఉపయోగపడుతుందని, ఎస్ టి ఏ వై ద్వారా మానసిక ప్రశాంతత, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి మానసిక స్థితిని, శారీరక దృఢత్వాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు. అంతేకాకుండా రక్తపోటును అదుపులో ఉంచుతూ గుండెను కాపాడుతూ రోగనిరోధక శక్తిని పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# తలకొండపల్లి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం

**– మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కటికెల శేఖర్ యాదవ్.**





**తలకొండపల్లి, జూన్21 (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తలకొండపల్లి గ్రామ సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ అన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు. ఆదివారం తలకొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల 6వ వార్డులో ఆయన పర్యటించి స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజి సమస్యలను పరిశుభ్రతతో పాటు కాలనీ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతానని ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ అంతిమ సంకల్పంగా చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలందరూ సమిష్టిగా సహకరిస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తలకొండపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తలకొండపల్లి గ్రామ సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

# వీరశైవ సమాజం పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం

-నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు చెప్పిన ఎమ్మెల్యే
-సంఘం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించాలి
-తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి



**తాండూర్ జూన్21ప్రజా జ్యోతి:-** తాండూరు పట్టణంలోని వీరశైవ సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం పట్టణ శివారులోని వీరశైవ సమాజ్యం కళ్యాణమంట పంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరశైవ సమాజ అభివృద్ధి కోసం నూతన పాలకమండలి సభ్యులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మతాలకతీతంగా సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నూతన కార్యవర్గం సహాయ సహకారాలు అందించాలని కోరారు. సంఘం చేపట్టే సేవా కార్యక్రమాలకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. నాయకత్వం అంటే కేవలం పదవి కాదు అనే విదంగా నూతన కార్యవర్గం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీరశైవ సమాజ అధ్యక్షుడు తంబాకు చంద్రశేఖర్, కార్యదర్శి వాలి శాంత్ కుమార్ లు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని చెప్పారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో ముందుకు వెళ్తామని చెప్పారు. తదుపరి వచ్చిన అతిథులకు శాలువాతో సన్మానించి మెమోటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజా బాలైడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సిములు, బిఆర్ఎస్ పార్టీ తాండూరు నియోజకవర్గం ఇంచార్జి శ్రీశైల్ రెడ్డి,కౌన్సిలర్లు రూప రుద్ర పాటిల్, సుప్రీత కరుణాకర్, అంతారం కిరణ్, వాలి వినోద్ కుమార్,దినేష్ కుమార్,గౌరవ అతిథులు మఠం నీలకంఠయ్య, మడపతి చంద్రశేఖర్, కిరణ్ కుమార్, చంద్రకాంత్, శివశంకర్, బసన్న,ఆర్ బస్వరాజ్, జొన్నల బస్వరాజ్, గాజుల సిద్దేశ్వర్,కిరణ్ కుమార్, కాంగ్రెస్, బిజెపి,బిఆర్ఎస్ పార్టీల నాయకులు వీరసేవ సమాజం ప్రముఖులు, ఉపాధ్యక్షులు శెట్టి భాస్కర్, సహాయ కార్యదర్శి ఆడ్కి శశాంక్, కోశాధికారి కందనెల్లి ప్రకాష్, కార్యవర్గ సభ్యులు ఘనపూర్ శంకర్, వాలి శాంత్ కుమార్, లింగదల్లి రవికుమార్, చంద్రకాంత్, డాక్టర్ సంపత్ కుమార్, కిరణ్ కుమార్, భద్రప్ప, ఆర్ బస్వరాజ్, బొబ్బిలి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ భరోసా

సర్పంచ్ కేశమోని రాజు
లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**యాచారం, జూన్ 21 (ప్రజాజ్యోతి):** పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారికి అనారోగ్య విషయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని చౌదర్పల్లి సర్పంచ్ కేశమోని రాజు చెప్పారు. చౌదర్పల్లికి చెందిన కంబాలపల్లి పెంటమ్మ, బుడగాల అండాలు వైద్య ఖర్చులకోసం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో పెంటమ్మకు రూ.28 వేలు,అండాలుకు రూ. 32 వేల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయ్యింది. మంజూరైన చెక్కులను సర్పంచ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన లబ్ధిదారులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు భరోసాగా నిలుస్తుందని. నిరుపేదల ఆరోగ్య సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అనారోగ్య బాధితులు మెరుగైన ఆరోగ్యాన్ని పొందేలా ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ను మంజూరు చేస్తుందన్నారు. ఉపసర్పంచ్ గొరిగే శ్రీశైలం, గ్రామ శాఖ అధ్యక్షులు గౌర శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**తాండూర్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో తాండూర్ మండల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, తాండూర్ పీహెచ్‌సీ ఆయష్ దవాఖానలో డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సామూహిక యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వాటి ప్రయోజనాలు గురించి యోగా శిక్షకులు, పీఈటీ తొగరి శ్రీనివాస్, ఉప్పుట్ల చందు అవగాహన కల్పించి కొన్ని ముఖ్యమైన ఆసనాలను కార్యక్రమానికి హాజరైన వారితో వేయించారు. యోగా సాదనతో అనేక శారీరక రుగ్మతలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. నిత్యం యోగా సాధనతో మన శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పని చేసి వ్యాదులను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యానికి వెళ్లే వచ్చేసరికి నాలుగు తులాల బంగారం మాయం

-వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ పరమేష్ గౌడ్

**తాండూరు జూన్ 21 ప్రజా జ్యోతి :-** ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారం మాయమైన ఘటన తాండూర్ పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పరకాల ప్రకారం తేదీ జూన్ 19న మామిడి రాజన్న భార్యతో కలిసి పెళ్లి వేడుకలకు వెళ్లడం కోసం ఇంటికి తాళం వేసి శనివారం నాడు కర్ణాటక రాష్ట్రం చించోలిలో జరిగిన పెళ్లి వేడుకలని వెళ్లారు, తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న బీరువాలోని లాకర్ ను పరిశీలించగా అందులోని నాలుగు తులాల బంగారు నగలు కనిపించక పోయేసరికి ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ పరమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయంపై తనకు ఎలాంటి అనుమానాలు లేవని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బంగారం దొంగిలించి ఉంటారని అనుమానం వ్యక్తం చేసినట్లు చెప్పారు.

## ప్రమాదవశాత్తు ట్రైన్ ఢీకొని వ్యక్తి మృతి



**మోమిన్ పేట్ జూన్ 21 (ప్రజా జ్యోతి)** ప్రమాదవశాత్తు ట్రైన్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మోమిన్ పేట్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ శివారులో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోమిన్ పేట్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు తండ్రి చంద్రయ్య కు పది స,,రల క్రితం వివాహం అయ్యింది భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు తగిన మత్తులో భార్య తో గొడవపడి శనివారం రాత్రి బైక్ తీసుకొని ఇంటినుండి వెళ్ళాడు తిరిగి ఇంటికి రాలేదు అని భార్య తెలిపింది విషం తెలుసుకొని రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చి శవ పంచనామా చేసి పోస్ట్ మాస్ట్ మ్ నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం బాడీ ను కుటుంబ సభ్యులకు అప్పగించారు

## కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు అండ

చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకల్ పల్లి చంద్ర శేఖర్



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) జూన్ 21 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని చాకల్ పల్లి గ్రామంలో నీరు పేద ప్రజల ఆరోగ్య దృష్ట్యా ప్రభుత్వం అందిస్తున్న సీఎం ఆర్ ఫ్ ఆపదలో ఉన్నవారికి వరముల ఆదుకుంటు పరిగి ఎమ్మెల్యే సహాయంతో ఆదివారం చౌడాపూర్ మండలంలోని చాకలి పల్లి.చిన్న మేగ్య తండా కు చెందిన.అంజమ్మ.రాజు లకు చెక్కులు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్.ఏ ఏ పీ చైర్మన్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య సొసైటీ డైరెక్టర్ మేకల బీమయ్య గాజుల చంద్రశేఖర్ పెద్దబాయి విజయ్ గొడుగు బాల రాజ్ ఒక చెన్నయ్య చెంచు వెంకటయ్య వార్డ్ మెంబర్ రాజు కేశవులు గ్రామ పెద్దలు లక్ష్మయ్య గోపియా నాయక్ బొక్క నర్సింలు రాములు కొల్లి చెన్నయ్య వడ్డే హనుమంతు చెంచు వెంకటయ్య వార్డ్ మెంబర్ కావలి లి చెన్నయ్య పెద్దవాయి శేఖర్ బుడగ జంగం చంద్రయ్య చాకలి కేశవులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని ఈ యొక్క చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యానిమనోహర్ రెడ్డి



**బషీరాబాద్ జూన్ 21 ప్రజా జ్యోతి** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయిల్ గౌడ్ అన్న కుమారులు నిరంజన్ గౌడ్, చింటూ,నూతన గృహప్రవేశం పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, బషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజ వర్ధన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి పవన్ ఠాకూర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనూఫ్, నరేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్, శేఖర్ గౌడ్, కురువ సంఘం మండల ఉపాధ్యక్షుడు మాణిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగుపై ఎల్‌నినో!

**ఖమ్మం జిల్లాలో జాడలేని వర్షాలు**
**ఈ ఏడాది భారీగా తగ్గనున్న వరిసాగు**
**ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలంటున్న అధికారులు**
**ఆరుతడి, పూనాస పంటలే దిక్కంటున్న రైతులు**



వాతావరణ శాఖ చెప్పినట్లే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పటివరకు వర్షాల జాడ లేదు. జూన్ చివరివారం వచ్చినప్పటికీ జిల్లాలో ఎక్కడా పెద్ద వానలు కురవలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే అసలు ఈ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారనున్నది. ముఖ్యంగా వరిసాగుపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుంది. దీంతో రైతులు అటు వరి నారుమడులు సిద్ధం చేయాలా, లేక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలా.. అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. అయితే ఈ నెలాఖరు వరకు సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే స్వల్పకాలిక వరి వంగడాలను విత్తుకోవాలని, లేదంటే ప్రత్యామ్నయ పంటలనే ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వానకాలం ప్రారంభమైందంటే చాలు ఖమ్మం జిల్లాలో రైతులు వరి నారుమడులు సిద్ధం చేయడంలో బిజీబిజీగా ఉంటారు. కానీ, ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. చిరుజల్లులు మినహా ఎక్కడా భారీ వర్షాలు నమోదు కాలేదు. భూమినే నమ్ముకొని కుటుంబాలను నెట్టుకొస్తున్న అన్నదాతలు వరుణదేవుడి రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఆకాశం వైపు చూస్తూ.. వానకాలం పంటల సాగుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. వానకాలంలో 3.20 లక్షల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వరిసాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఎల్‌నినో కారణంగా ఈ వానకాలం సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షాలు నమోదవుతాయన్న వాతావరణ శాఖ అంచనాలు రైతుల్లో ఆందోళన పెంచుతోంది. ఈ నెలాఖరు వరకు సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే స్వల్పకాలిక వరి వంగడాలను విత్తుకోవాలని, లేదంటే వద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీంతో రైతులు వర్షాలు కురుస్తాయా లేక ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలా అన్న మీమాంసలో పడ్డారు.

**భారీ వర్షాల కోసం ఎదురుచూపు..**

గతేడాది వానకాలం సీజన్ కంటే ముందే మే చివరిలోనే జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి, దీంతో రైతులు మొదటివారంలోనే పెద్దఎత్తున విత్తనాలు వేశారు. కానీ, ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వానలు పడ్డాయి. పలు మండలాల్లో అసలు వర్షపాతమే నమోదు కాలేదు. రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, కూసుమంచి, పాలేరు, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మినహాయిస్తే మిగతా అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు సాగు విషయంలో ఆందోళనకు గురవుతున్నారు. జూన్ మొదటి రెండు వారాల్లోనే రైతులు పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేస్తారు. వర్షాలు కురిస్తే అవి మొలకెత్తుతాయనే ఆశతో ముందుకెళ్తారు. జూన్ చివరి వరకు కూడా పత్తి విత్తనాలు వేయడాన్ని సాధారణ సాగుగానే పరిగణిస్తారు. జూలై మొదటి వారంలో కొంత ఆలస్యంగా, ఆ తరువాత వారాన్ని పూర్తిగా ఆలస్యంగా పరిగణిస్తారు. ఆలస్యంగా సాగు చేయడం ద్వారా చీడపీడలు, ఎదుగుదల లోపం, కాత, పూత సరైన సమయంలో రాకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమై పంట నష్టాన్ని చవిచూసే పరిస్థితి ఉంటుంది. ఈ కారణంగా జూన్‌లోనే విత్తనాలు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతుంటారు.

**ప్రత్యామ్నాయ పంటల వైపు..**

వర్షాభావ పరిస్థితులు, యూరియా కొరత, ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో సమస్యల నేపథ్యంలో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి పంటలు కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు అని శాస్త్రవేత్తలు చెప్పడంతో రైతులు అటువైపుగా చూస్తున్నారు. 120 రోజుల కాలవ్యవధిలో చేతికొచ్చే పంట రకాలు ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాలపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇది కూడా వేయలేకపోతే తక్కువ నీటి తడులతో పండే పంటలైన జొన్న, శనగ, పెసర, బొబ్బెర, కూరగాయల పంటలు సాగు చేయాలని బోర్లు, బావుల కింద ఉన్న రైతులు ఆలోచన చేస్తున్నారు.



# చంచల్‌గూడ జైలుకు ప్రభాస్.. 'స్పిరిట్' కీలక షెడ్యూల్ షురూ!

రెబల్ స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన షెడ్యూల్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో హీరో ప్రభాస్ స్వయంగా పాల్గొనబోతున్నట్లు సమాచారం. కథలో ఎంతో కీలకమైన సన్నివేశాలను ఈ జైలు లొకేషన్‌లో చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేసింది. హై వోల్టేజ్ డ్రామా, యాక్షన్ సీక్వెన్స్‌లుగా సాగే ఈ సీన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని ఇండస్ట్రీ టాక్. సందీప్ రెడ్డి వంగా మార్క్ మేకింగ్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్ పూర్తవగానే ప్రస్తుత షూటింగ్ ఫేజ్ ముగుస్తుంది. వెంటనే ఎలాంటి బ్రేక్ లేకుండా తర్వాతి షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'స్పిరిట్'పై ప్రభాస్ ఫ్యాన్స్‌లో ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.



# 'సింగ్ గీతం'కు ఫ్యామిలీ ఆఫర్.. తెలంగాణ మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధర తగ్గింపు!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు 61వ చిత్రంగా తెరకెక్కిన 'సింగ్ గీతం' సినిమా విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రంలో అయాన్, అహల్య ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ నేపథ్యంలో మేకర్స్ తెలంగాణలోని మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు రూ.200గా ఉన్న టికెట్ ధరను రూ.175కు తగ్గించారు. ఫ్యామిలీ ఆడియన్స్‌కు సినిమా మరింత అందుబాటులో ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు పలువురు సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా, తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ కూడా సపోర్ట్ చేస్తూ ప్రమోట్ చేశారు. ఈ పాజిటివ్ ఎండార్స్‌మెంట్స్, టికెట్ ధర తగ్గింపు వీక్ డేస్‌లో సినిమా వసూళ్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి. ఈ చిత్రంలో శాలిని కొండెపూడి, నివేదా పేతురాజ్, శివన్నారాయణ, బెనర్జీ, తులసి శివమణి, అగు స్టాన్లీ చియెడోజీ కీలక పాత్రల్లో కనిపించారు. విజయ్ దేవరకొండ స్పెషల్ క్యామియోలో మెరిశారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.



# లాభాల్లోకి సామ్ సినిమా.. 'బంగారం' వసూళ్లు ఎంతంటే?

చాన్నాళ్ల తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో వచ్చిన సమంత.. బాక్సాఫీస్ దగ్గర రచ్చ చేస్తోంది. టాక్ ఓ మాదిరిగా వచ్చినప్పటికీ, స్కూల్స్ కూడా తెరిచేసినప్పటికీ ఫ్యామిలీ ఈ మూవీ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అదంతా కలెక్షన్స్ రూపంలో కనిపిస్తోంది. రెండు రోజుల్లో ఊహించని వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరుస్తోంది. ఇంతకీ ఎన్ని కోట్లు వచ్చాయి? సమంత ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'మా ఇంటి బంగారం'. ఇందులో హీరో ఎవరూ లేరు. నందిని రెడ్డి దర్శకత్వం వహించగా.. సామ్ భర్త రాజ్ నిడిమోరు, స్టోరీ అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించారు. విడుదలకు ముందు ఓ మాదిరి హైప్ ఉన్నప్పటికీ థియేటర్లలోకి సినిమా వచ్చిన తర్వాత మంచి వసూళు రాబడుతోంది. తొలిరోజు రూ.13.15 కోట్ల గ్రాస్ రాగా.. రెండు రోజులకు కలిపి రూ.28 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. అంటే రెండో రోజు ఏకంగా దాదాపు రూ.15 కోట్లు వచ్చినట్లే. ఈ నంబర్స్ బట్టి సమంత సినిమా.. తొలి రెండు రోజుల్లోనే లాభాల్లోకి వచ్చేసింది. ఈ సినిమా సక్సెస్ అవడంతో పాటు సమంత జీవితంలోనూ మరో ముందడుగు వేసింది. ప్రస్తుతం ఈమె ప్రెగ్నెన్సీతో ఉంది. శనివారం జరిగిన సక్సెస్ సెలబ్రేషన్‌లో బేబీ బంప్‌తో కనిపించింది. ఈ ఏడాది డిసెంబరులోనే బిడ్డకు జన్మనివ్వబోతుందని కూడా మాట్లాడుకుంటున్నారు. గతేడాది డిసెంబరులో దర్శకుడు రాజ్ నిడిమోరుని సమంత పెళ్లి చేసుకుంది.

# 'చెన్నై లవ్ స్టోరీ'తో మరో బ్లాక్‌బస్టర్ ఖాయం..



యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా తిరుపతిలో నిర్వహించిన 'జిగితార' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం చేసిన వ్యాఖ్యలు మరింత హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సందర్భంగా మాట్లాడిన కిరణ్ అబ్బవరం, 'క' సినిమా మంచి విజయాన్ని సాధించిందని, 'కె ర్యాంప్'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నామని, ఇప్పుడు 'చెన్నై లవ్ స్టోరీ' కూడా అదే స్థాయిలో విజయాన్ని అందుకుంటుందని పూర్తి నమ్మకంతో చెప్పారు. 'చెన్నై లవ్ స్టోరీ'లో తన పాత్ర ఇప్పటివరకు చేసిన సినిమాల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుందని కిరణ్ తెలిపారు. ఈ సినిమా కథ విన్నప్పుడు తన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తొచ్చాయని, ఆ కారణంగా ఈ కథతో చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యానని చెప్పారు. ఈ సినిమా నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తు చేసింది. చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యాను. ప్రేక్షకులు కూడా ఈ కథకు కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను అని కిరణ్ పేర్కొన్నారు.

# బిగ్‌బాస్ 10లోకి జబర్దస్త్ బ్యూటీ

## సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం!



తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే విజయవంతంగా తొమ్మిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు ల్యాండ్‌మార్క్ సీజన్‌గా పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మేకర్స్ వరుస ప్రోమోలు, అప్‌డేట్స్‌తో ఆసక్తిని పెంచుతుండగా, కంటెస్టెంట్ల ఎంపికపై కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం 'బిగ్‌బాస్ తెలుగు 10' ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులకు అవకాశం కల్పిస్తూ 'అగ్నిపరీక్ష 2' ద్వారా కంటెస్టెంట్లను ఎంపిక చేయనున్నారు. పదో సీజన్ కావడంతో హౌస్‌లో అనేక సర్‌ప్రైజ్‌లు, కొత్త గేమ్స్, వినూత్న టాస్కులు, భిన్నమైన కాన్సెప్ట్‌లు ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ సీజన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు టీవీ నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ల పేర్లు బిగ్‌బాస్ కంటెస్టెంట్ల జాబితాలో వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ కుటుంబ సభ్యులు, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కదలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణి, ప్రభాకర్ లేదా చంద్రహాస్ వంటి పేర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ జాబితాలో తాజాగా మరో పేరు బలంగా వినిపిస్తోంది. ఆమెనే జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర. జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి పలు కామెడీ షోల ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న పవిత్ర ప్రస్తుతం బిగ్‌బాస్ సీజన్ 10లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు బ్యూటీ పార్లర్‌లో పనిచేసిన పవిత్ర, తన ప్రతిభతో, కష్టంతో బుల్లితెరపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కామెడీ టైమింగ్, ఎనర్జీ, సహజమైన ప్రవర్తనతో ఆమె ప్రేక్షకులకు దగ్గరయ్యారు. గతంలో కూడా పవిత్ర పేరు బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా పలుమార్లు వినిపించింది. అయితే ఈసారి మాత్రం ఆమె హౌస్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోషల్ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బిగ్‌బాస్ టీమ్ ఆమెతో చర్చలు జరిపినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పవిత్ర నిజంగానే బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెడితే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదని అభిమానులు భావిస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com